ప్రజాశక్తి

శుక్రవారం 11 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఓటర్ల జాబితాలు లేకుండానే

- ముందస్తు కసరత్తు లేకుండా నీటి సంఘాలకు ఎన్నికలు
- రైతులు, కౌలురైతులకు ఓటు హక్కు ఉంటుందన్న అధికారులు
- ఆదరాబాదరాగా జాబితాల రూపకల్పన
- ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి అందని సమాచారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

నీటి సంఘాలు (వాటర్ యూజర్స్ అసోసియేషన్) డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ముందస్తు కసరత్తు లేకుండా షెడ్యూలు ప్రకటించిందనే విమర్శలు వస్తున్నాయి. సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగిన ఏర్పాట్లపై ఇంకా స్పష్టత లేదు. అంతేగాక ఏ సంఘంలో ఎంత మంది ఓటర్లున్నారనే అంశంపైనా అధికారుల వద్ద సమాచారం లేదు. మొత్తంగా జిల్లాలో ఎంత మంది రైతులకు ఓటు ఉంది? ఎంత మంది కౌలు రైతులకు ఓటు హక్కు ఉందో కూడా స్పష్టత లేదు. కేవలం గ్రామాల్లో మొక్కుబడిగా ఎన్నికలు జరిగే తంతు కనుక నీటి పారుదల శాఖ అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఎవరు అధికారంలో ఉంటే వారు గ్రామ సభ ఏర్పాటు చేసుకుని చేతులెత్తే పద్ధతిలో నీటి సంఘం ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని అందువల్ల ఓటర్లకు సంబంధించి మండల, జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు తగిన జాబితాల రూపకల్పన జరగలేదని చెబుతున్నారు.

గుంటూరు జిల్లాలో 160 నీటి సంఘాలు ఉన్నట్టు నీటి పారుదల శాఖ ఎస్ఇ ఉమామహేశ్వరరావు తెలిపారు. మొత్తం 22 డిస్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయన్నారు. సాగు నీటి సంఘాలకు ఈనెల 16న నోటిఫికేషన్ ఇస్తామని, 17 నుంచి 20వ తేదీ వరకు సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. 21న మొత్తం 22 డిస్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 24న కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు జరగనున్నాయన్నారు. గత ఆరేళ్లలో కొత్త ఆయకట్టు రానుందన గతంలో ఉన్న పరిధిలోనే నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లుగా రైతులు, కౌలురైతులు ఉంటారన్నారు. వీరు ఎంత మంది అనేది ప్రస్తుతం అధికారులు జాబితాలు తయారు చేస్తున్నారని

2లో

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు,పాశం రామారావు తదితరులు

సమకాలీన రాజకీయ పరిణామాలపై 21న సభ

హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి-గుంటూరు

సమకాలీన రాజకీయ అంశాలపై అక్టోబర్ 21న సాయంత్రం 4 గంటలకు గుంటూరు శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని గురువారం బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై ప్రసంగిస్తారన్నారు. ఇటీవల సాధారణ ఎన్నికల్లో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పూర్తి మెజారిటీ లేకపోయినా తన నియంతృత్వ విధానాల నుండి మాత్రం వెనక్కు తగ్గడం

2లో

గుంటూరు యుటిఎఫ్ ఆఫీసులో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తదితరులు

యుటిఎఫ్ కార్యాలయంలో పట్టభద్ర ఓట్ల నమోదు కేంద్రం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు-కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గానికి 2025 ఫిబ్రవరి గానీ, మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన పట్టభద్రులు అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. గుంటూరు, బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఓటర్ల నమోదు కేంద్రాన్ని వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో శాసన మండలి పునరుద్ధరించిన నాటి నుంచి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఫోరమ్‌గా ఏర్పడి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం, ప్రజాతంత్ర హక్కుల పరిరక్షణకు అత్యంత నిజాయితీతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గుంటూరు-కృష్ణా గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించిందని, నవంబర్ 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారాగానీ, ఆఫ్‌లైన్ ద్వారాగానీ నమోదు చేసుకోవాలని అన్నారు. 2021 అక్టోబర్ 31లోపు డిగ్రీ గానీ డిప్లొమా పూర్తి చేసిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు ప్రక్రియలో ఫారం 18కు ఆధార్ కార్డు, డిగ్రీ లేదా డిప్లమా సర్టిఫికెట్, నివాస ధ్రువీకరణ పత్రం, ఫోటో తప్పనిసరిగా జతచేసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. సమాచారం కోసం గుంటూరు, కృష్ణా

2లో

సహకార ఉద్యోగులకు జీతాల చెల్లింపునకు సిఇఒ ఆదేశాలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులపై రాజకీయ వేధింపులు వేతనాలు చెల్లించకపోవడం వంటి ఘటనలపై గత ఆదివారం ప్రజాశక్తిలో 'సహకారం' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం గుంటూరులోని గుంటూరు కేంద్ర సహకార బ్యాంకు (జిడిసిసి బ్యాంకు) ప్రధాన కార్యాలయంలో అన్ని జిడిసిసి బ్యాంకు బ్రాంచ్‌ల మేనేజర్లతో సిఇఒ టి.కృష్ణవేణి సమావేశమయ్యారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను సత్వరమే చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.

సమకాలీన రాజకీయ పరిణామాలపై 21న సభ

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. రాష్ట్రాల హక్కులను, ప్రజాస్వామ్యాన్ని హరించే విధానాలు అవలంబిస్తుందని, ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినా మన దేశంలో పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గకపోగా పెరుగుతున్నాయని చెప్పారు. మరోవైపు ఉపాధి లేక ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. క్రిమినల్ చట్టాల్లో మార్పులు తెచ్చి, ప్రతిపక్షాలు, ఉద్యమకారులపై నిర్బంధాన్ని ప్రయోగించే చర్యలకు నాందిపలికిందని తెలిపారు. దేశంలో అనేక చోట్ల దళితులు, మహిళలు, చిన్నారులుపై అత్యాచారాలు, అకృత్యాలు జరుగుతూనే వున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో ఇసుక సమస్య తీవ్రంగా వుందని, భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఎన్నికల ముందు, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా సున్నితమైన అంశాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తూ ప్రజాసమస్యలను చర్చకు రాకుండా చేస్తూన్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో వీటన్నింటికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో సిపిఎం నిర్వహించే సభలో ఎక్కువ మంది ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, నగర కార్యదర్శి కె.నళినీకాంత్, నాయకులు బి.శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, కృష్ణకాంత్, సాంబశివరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు లేకుండానే

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అయితే రైతులు ఎక్కువ మంది గ్రామాల్లో ఉండటం లేదు. వాస్తవంగా పట్టాదారు పుస్తకం ఎవరి పేరున ఉంటే వారే రైతుగా పరిగణిస్తారు. వీరికే ఓటు హక్కు ఉంటుంది. వీరు స్థానికంగా ఉండకపోవడం వల్ల ఎక్కువ మంది ఈ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండదు. ఇందుకు సంబంధించి రైతులకు ఇప్పటి వరకు ఏ సమాచారమూ లేదు. కొంత మంది రైతులు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో కూడా ఉంటారు. వీరిని గుర్తించి వీరికి సమాచారం ఇవ్వడానికి సమయం చాలా తక్కువగా ఉంది. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారించలేదు. కౌలు రైతులకు సంబంధించి వారికి సిసిఆర్‌సి ఉంటేనే ఓటు హక్కు ఉంటుంది. చాలా మంది కౌలు రైతులకు సిసిఆర్‌సిలు లేవు. జిల్లాలో లక్షన్నర మంది కౌలు రైతులు ఉన్నట్టు అంచనా కాగా అధికారులు 40 వేల మందికి సిసిఆర్‌సిలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వాస్తవ అర్హత కల్గిన రైతులు, కౌలు రైతుల జాబితాల రూపకల్పన లేకుండా హడావుడిగా షెడ్యూలు ప్రకటించడం చర్చనీయాంశమైంది. షెడ్యూలు ప్రకటించిన తర్వాత ఓటర్ల జాబితాల తయారీపై అధికారులు నిమగ్నం కావడం విశేషం.

ఎన్నికలు మమ అన్పించడమేనా?

సాగునీటి సంఘాలకు కమిటీల్లోని సభ్యులను ఆయకట్టు పరిధిలోని రైతులు ఎన్నుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా కేవలం చేతులెత్తే పద్ధతి లేకుండా ఫలానా వారిని కమిటీల్లో ఎంపిక చేశాం. మీకు ఓకే కదా అనే విధానం అమలు చేయడం 2015లో జరిగింది. ఇప్పుడు కూడా ఇదే పద్ధతి కొనసాగుతుందనే భావనలో అధికారులున్నారు. ప్రతిపక్ష వైసిపి, ఇతర పార్టీల వైఖరి ఇంకా ప్రకటించ లేదు. ఎక్కడైనా పోటీ జరిగితే దాన్ని వాయిదా వేసి అడ్డదారిలో నిర్వహించే ఆలోచనలో అధికార పార్టీ నాయకులు ఉన్నారనే భయం కూడా ప్రతిపక్షాల్లో ఉంది.

ఆయకట్టు పరిధిలో పొలం ఉండే రైతుతో పాటు స్థానికంగా వ్యవసాయం చేసే వారిని కమిటీల్లో ఎన్నుకుంటే ఎప్పటికప్పుడు సీజన్ల వారీగా వచ్చే సమస్యలను సంబంధిత సంఘాలు వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఏదో తమకు హోదా కావాలని, కనుక ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని కూడా కమిటీ చైర్మన్‌గా ఎన్నుకుంటే రైతులు మేలు జరగదు. సమస్యలపై తక్షణ స్పందన ఉండదు. ఇదింకా నష్టమనే అభిప్రాయం సర్వత్రా నెలకొంది.

క్రీడా స్ఫూర్తి అవసరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రీడలలో గెలుపు ఓటమిలు ముఖ్యంకాదని ప్రతిభ కనబర్చిన ఇతర క్రీడాకారుల స్ఫూర్తి ప్రధానమని రోటరీ క్లబ్ ప్రేరణ సభ్యురాలు కె. చందన అన్నారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన జిల్లా క్రీడాకారులకు స్థానిక నవభారత్ నగర్‌లో గురువారం అభినందన సభ జరిగింది. రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో గుంటూరు క్రీడాకారులు పతకాలు సాధించి జిల్లా కీర్తిని పెంపొందించినందుకు ఆమె అభినందించారు. ప్రతి క్రీడాకారుడు తాను అనుకున్న లక్ష్యం కోసం నిరంతరం కృషి చేయాలని అప్పుడే విజయాలు సాధించవచ్చు అని తెలిపారు. మరో అతిథి నాట్ వెల్నెస్ డైరెక్టర్ నూతలపాటి గోపీనాథ్ మాట్లాడుతు తమ సంస్థ ద్వారా క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని, క్రీడాకారులకు కావలసిన పోషక విషయాలు ఆయన వివరించారు. తమ సంస్థ ద్వారా వివిధ రకాల పోషకాలను అందించామని తెలిపారు. జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు మొత్తం 34 పతకాలు సాధించారని, 13 బంగారు 9 వెండి, 12 కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 17 నుంచి 19 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. అథ్లెటిక్ శిక్షకులు సిహెచ్ వి రాజు, నాని, కె అరుణ్ కుమార్, పి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో కే చందన, నూతలపాటి గోపీనాథ్, జి వి ఎస్ ప్రసాద్

అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి తెనాలి

దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అత్తోట గ్రామంలో పట్టణానికి చెందిన అభ్యుదయ కళాశాల ఆధ్వర్యంలో గురువారం 'రేపేంది' నాటిక ప్రదర్శించారు. దివాకర్ బాబు రచనకు దేవిశెట్టి కృష్ణారావు దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. సమాజంలో చదువు లేని వారు దౌర్జన్యం చెలాయిస్తున్నారని, చదువుకున్న వారు కూడా వారికి భయ పడాల్సిన పరిస్థితులు ఉన్నాయని, రేపేంటో తెలియని వారు కూడా పదవులు ఏలుతున్నారని, అయితే చదువుతో జ్ఞానాన్ని పంచుతూ, సమాజాన్ని చైతన్యపరిచే తీరుకు అద్దం పడుతూ నాటిక ఇతివృత్తం సాగింది. బెల్లంకొండ వెంకట్, స్వామి, రామరాజు, విష్ణువర్ధన్, కృష్ణారావు నటించారు.

రేపేంది' నాటికలో సన్నివేశం

వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

వర్షాలకు సత్తెనపల్లి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గురువారం ఒక్కసారిగా కుండపోత వర్షం పడింది. దీంతో పట్టణంలోని లోతట్టు పాంతాలు సుందరయ్య కాలనీ, యానాది కాలనీ, నాగన్నకుంటతో పాటు తాలూకాలోని కోర్టు భవనాల సముదాయం ప్రాంతం జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు . ఒకవైపు ఎండ కాస్తూనే మరొకవైపు భారీ వర్షం కురవటం ప్రజలకు తీవ్ర అసౌకర్యం కల్గించింది. పట్టణంలోని 8వ వార్డులో ఇండ్ల స్థలాల మధ్యకు నీరు చేరి ఒక చిన్న చెరువును తలపించింది.

హైదరాబాద్ ప్రాజెక్టులను పరిశీలించిన జిఎంసి బృందం

ప్రజాశక్తి - గుంటూరు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ కేటగిరీలుగా ఆస్తిపన్ను విధింపు, వసూళ్లు, సమగ్ర రహదారి నిర్వహణ విధానం, ఆర్థిక వనరులు, ముఖ్యమైన ప్రాజెక్ట్‌లను గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బృందం గురువారం పరిశీలించింది. ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లలో అమలు చేస్తున్న కార్యక్రమాల అధ్యయన యాత్రలో భాగంగా గురువారం జిహెచ్‌ఎంసిలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, ప్రాజెక్ట్‌లను జిఎంసి కమిషనర్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కమిషనర్ బృందానికి తొలుత గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగర జనాభా, నివాస, కమర్షియల్ భవనాలు, ఆస్తి పన్ను విధింపు, వసూళ్ళ వివరాలను నోడల్ అధికారులు వివరించారు. హైదరాబాదులో అమలు చేస్తున్న సమగ్ర రహదారి నిర్వహణ విధానాన్ని పరిశీలించి, విధి విధానాలను తెలుసుకున్నారు. ఆస్తి పన్ను పరిధిలోకి వచ్చే భవనాలను భౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐఎస్) ద్వారా పర్యవేక్షణ తీరును పరిశీలించారు. ప్రాజెక్ట్‌ల పరిశీలనలో భాగంగా హైదరాబాదు ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ పాయింట్, ఆర్‌డిఎఫ్, విండ్రో కంపోస్ట్ యూనిట్‌లను సమగ్రంగా పరిశీలించి, నిర్వహణ, పనితీరు, ఖర్చులను అధికారులు వివరించారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి : ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి-వినుకొండ

రాష్ట్రంలో త్వరలో జరగబోతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కొట్టే దెబ్బకు మళ్లీ వైసిపి లేవకూడదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఉద్యోగాల్లేకుండా, ఉపాధి లేకుండా అయిదేళ్ల పాటు సాగించిన విధ్వంసపు పాలనను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరు ఓట్లు నమోదు చేసుకుని మార్పును బలపరిచేందుకు కూటమి అభ్యర్థిని గెలించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు సంబంధించిన దరఖాస్తులను గురువారం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పంపిణీ చేశారు. వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు పరిశీలకులుగా నాయకులు పంచుమట్టి భూపతిరావు, పాములపాడు శ్రీనివాసరావు, నల్లబోతు శ్రీనివాసరావు, రఘురావు నాయుడు, సైదారావు, రాంకోటేశ్వరరావును నియమించారు. వినుకొండ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఓటు నమోదు దరఖాస్తులను అందజేశారు. నాయకులు లెనిన్, ఆయూబ్ ఖాన్, సాంబశివరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వినికిడి పరికరాల దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులోని ఏరియా హాస్పిటల్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ అఫ్ డెఫ్నెస్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వినికిడి పరీక్షలు, వినికిడి యంత్రాల కోసం ఈనెల 14న దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారు ఆధార్ జిరాక్స్, 2 పాసుపోర్టు ఫొటోలు, రేషన్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్‌తో సంప్రదించాలన్నారు.

యుటిఎఫ్ కార్యాలయంలో పట్టభద్ర ఓట్ల నమోదు కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి జిల్లాల యూటిఎఫ్ కార్యాలయంలో అప్లికేషన్లు, ఆన్లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అర్హత కలిగిన గ్రాడ్యుయేట్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఎమ్‌డి.గయాసుద్దౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, యు.రాజశేఖర్‌రావు, జి.వెంకటేశ్వరరావు, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, కె.కేదార్‌నాథ్, కె.ప్రేమ్‌కుమార్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రభూజీ పాల్గొన్నారు.

చెట్ల పెంపకంతో కాలుష్య రహిత సమాజం

ప్రజాశక్తి - ఈపూరు : కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు చెట్లను పెంచాలని అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీఓఎఫ్ఐ) ప్రతినిధి సి.వెంకటేష్ అన్నారు. మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో రైతులకు ఆగ్రో ఫారెస్ట్రీ కార్యక్రమంపై రైతులకు శిక్షణ,అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు జి.యతేంద్ర నాగరాజు పొలంలో ఉద్యాన మొక్కలు, అడవి జాతి మొక్కలు పెంచడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అటవీయేతర ప్రాంతంలో చెట్లను పెంచేందుకు గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. భావితరాలకు చెట్ల పెంపకం అవసరమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు టి.బాలయ్య, సిసి అనిల్, మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ బ్యాంకులో సిఐడి విచారణ

- **సిబ్బంది, ఖాతాదారులతో వేర్వేరుగా మాట్లాడిన అధికారులు**
- **బాధితులకు పూర్తి పరిహారం చెల్లిస్తామన్న బ్యాంకు ప్రతినిధి**

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకులో భారీ కుంభకోణం జరిగిన విషయం తెలిసిందే దీనిపై సిఐడి విచారణ నేపథ్యంలో అధికారులు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకులో వివరాలు సేకరించారు. సిఐడి అడిషనల్ ఎస్పీ సిహెచ్ ఆదినారాయణ మాట్లాడుతూ అవకతవకలపై బ్యాంకు సిబ్బందిని విచారణ చేశామని,

ఖాతాదారులతోనూ మాట్లాడామని చెప్పారు. నరసరావుపేట, విజయవాడలోని మారుతినగర్‌లో గల బ్రాంచ్‌లలో కూడా ఈ అవకతవకలు జరిగాయన్నారు. విజయవాడ బ్రాంచ్ మేనేజర్ దిలీప్ మహంతి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. చిలకలూరిపేట బ్రాంచ్‌లో మేనేజర్ నరేష్ చంద్రశేఖర్, ఇద్దరు బ్యాంక్ సిబ్బంది ఈ అవకతవకలకు పాల్పడ్డట్లు గుర్తించామన్నారు. చిలకలూరిపేటలో మొత్తం 72 మంది ఖాతాదారుల వద్ద నుంచి రూ.28 కోట్ల అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. నరసరావుపేట, విజయవాడలో అక్రమాలపైనా విచారణ చేస్తునామని చెప్పారు. మోసపోయిన ఖాతాదారులకు నగదు చెల్లి చెల్లించే విషయంలో బ్యాంకు సిబ్బంది ఆర్థిక గ్యారంటీ ఇస్తామని చెప్పినట్లు తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంకు ప్రతినిధి మాట్లాడుతూ తమ బ్యాంకు కార్యకలాపాల్లో కస్టమర్ల సేవలకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. అవకతవకలు జరిగినట్లు గుర్తించామని, మోసాలను సహించబోమని చెప్పారు. నిజమైన కస్టమర్లకు నష్టం జరిగితే వారికి పూర్తిగా నష్టపరిహారం చెల్లించే ఆర్థిక భరోసా ఇవ్వాలనుకుంటున్నామన్నారు. మోసాలకు పాల్పడిన బ్యాంకు సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేశామన్నారు. సిఐడి అధికారుల వెంట డీఎస్పీ సంజీవ్ కుమార్ ఉన్నారు.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 26,903
మిర్చి ఎగుమతి	: 32,300
మిర్చి నిల్వ	: 18,188

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 16,500
నెం.5	9,500 - 13,500
273	13,200 - 13,200
341	8,000 - 16,000
4884	11,000 - 12,000
	నాన్ ఎసి
తేజ	8,000 - 18,500
బడిగి	8,000 - 14,500
దేవనూరు డీలక్స్	8,000 - 14,500
తాలుకాయలు	5,000 - 12,000
	ఎసి
334	8,000 - 16,500
నెం.5	10,000 - 14,000
273	12,500 - 13,500
341	9,000 - 16,900
4884	10,000 - 12,000
తేజ	8,500 - 18,500
బడిగి	8,000 - 14,500
దేవనూరు డీలక్స్	8,000 - 16,000
తాలుకాయలు	5,000 - 11,500

మద్యం టెండర్ల ప్రక్రియపై దుష్ప్రచారం చేస్తే చర్యలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ అధికారులు అనేక రాష్ట్రాల్లో తిరిగి నూతన మద్యం విధానాన్ని అమలు చేసేందుకు పూర్తి స్థాయిలో కసరత్తు చేశారని, మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నరసరావుపేట ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా స్వేచ్ఛగా టెండర్ వేసుకోవచ్చున్నారు. 5 నిమిషాల వ్యవధిలో ఆన్లైన్లో టెండర్ వేసే వెసులుబాటు ఉందన్నారు. గతంలో మద్యం వ్యాపారం చేసిన వారు కేవలం వారి స్వార్థం కోసమే లేనిపోని పుకార్లు పుట్టిస్తున్నారని, టెండర్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా కొనసాగుతోందని చెప్పారు. దీనిపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 14న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామని, రాజకీయ ఇబ్బందులు ఎదురైతే టెండర్లు ఆన్లైన్లో వేసి లాటరీ రోజు మాత్రం రావచ్చని అన్నారు. జిల్లాలో మద్యం టెండర్ల విషయంలో ఎమ్మెల్యేల జోక్యం లేదని చెప్పారు. రాష్ట్రంలో తక్కువగా టెండర్లు పడిన జిల్లాలో పల్నాడు జిల్లా ఉందన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మణికంఠ పాల్గొన్నారు.

4 ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట మండలం నుండి రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు లారీలను తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ బుధవారం రాత్రి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ తరలించారు. రాత్రి వేళల్లో కృష్ణా నదిలో నుండి ఇసుకను డంపింగ్ చేసి మరుసటి రోజు లోడింగ్ చేస్తున్నట్లు సమాచారం తెలియటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. అచ్చంపేట నుండి పిడుగురాళ్ల వైపు వెళ్తున్న నాలుగు లారీలు కొండూరు రహదారిలో పట్టుకున్నారు. గత వారం రోజులుగా రాత్రి సమయంలో ట్రాక్టర్లు ఇసుక రేవుల నుండి రవాణా చేస్తున్నారు. ఇసుక డిమాండ్ ఉండటంతో అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. 30 కిలోమీటర్ల మేర కృష్ణానది ఉండటంతో అక్రమార్కులు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని సిఐ వెంకటప్రసాద్ అన్నారు. పట్టుబడిన వాహనాలకు కోర్టులో అపరాధరం చెల్లించి రిలీజింగ్ ఆర్డర్లు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పేరు మార్పు

నేను మేరి చల్లా W/o మర్రి చిట్టిబాబు D/o చల్లా పోతురాజు, నివాసం : డోర్ నెం.2-89/బి, నవులూరు, గుంటూరుజిల్లా. నా యొక్క పూర్వపుపేరు **మేరి చల్లా,** ఇప్పుడు వివాహం తర్వాత నా పేరు **మర్రి జ్యోతి** గా మార్పు చేయటం జరిగినది. నేటి నుండి నా పేరును **మర్రి జ్యోతి W/o మర్రి చిట్టిబాబు** (MARRI JYOTHI W/O MARRI CHITTI BABU) గా పిలవబడును.

మహారాజశ్రీ నరసరావుపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో..

A.S. No:210/2024

Between:

యన్నం పద్మావతి ....అప్పిలెంట్

V/S

ఐనవోలు రాధ ....అండ్ అదర్ రెస్పాండెంట్స్

2) యన్నం కోటేశ్వరమ్మ w/o కుప్పస్వామి, లింగంగుంట్ల, అగ్రహారం, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా.

To,

పై నెంబరు A.S. No.:210/2024 నందు ప్రతివాది అయిన మీరు శ్రీ పైకోర్టు వారి నుండి అనేక మార్లు నోటీసులు/సమన్లు పంపిననూ మీకు ముట్టక/మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సదరు పై దావాలో నోటీసు/సమన్లు నిమిత్తము శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలిజేయటమైనది. వాయిదా ది.25-10 2024 న వాయిదా అయి ఉన్నది.సదరు వాయిదా తేదీన ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్ష మందు తీర్మాణం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

వాయిదా ది.25-10-2024

ఇట్లు.
బోయిన పిచ్చేశ్వరరావు,
న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.

మహరాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 38/2022

Between:-

షేక్ ఇస్మాయేల్, షేక్ తరాభి ...వాదులు

మరియు

షేక్ బాజీ మరియు 7 మంది ...ప్రతివాదులు

శ్రీమతి తడువాయి శివపార్వతి, భర్త సుబ్బారావు, వయస్సు 40సం॥లు, తలుపు నెం. 1-127, కోనూరు గ్రామము అచ్చంపేట మండలం, గుంటూరు/పల్నాడు జిల్లా, 520007 (5వ ప్రతివాది)

పైదావాలోని వాదులు, దావాలోని ప్రతివాదులలో 2వ ప్రతివాది తేది. 23-4-2022న 5వ ప్రతివాదివైన నీకు దావా షెడ్యూలు ఆస్థిని నీ పేరున రిజిష్టరు తనఖా చేసియున్నారు. సదరు దస్తావేజును రద్దు పరచమని పై కోర్టు వారి ఎదుట ఇందలి వాదులు O.S.No.38/2022ను దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టు వారు అనేక పర్యాయములు నీకు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పత్రిక ప్రకటన ద్వారా దావా సమన్లు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై నీకు ఏమైనను అభ్యంతరములు ఉన్నయెడల తేది. 22-10-2024 వాయిదా రోజున ఉదయం గం. 10:30నిమిషములకు మీరుకానీ మీ న్యాయవాది ద్వారాగానీ హజరై మీకుగల అక్షేపణలు పై కోర్టు వారి ఎదుట తెలియపరచగలరు. లేనియెడల మీ పరోక్షము నందు విచారించి తీర్మానించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా తేది. 22-10-2024

ఇట్లు
అయినంపూడి పవన్ కుమార్
వాదుల తరుపున న్యాయవాది, చీరాల
Cell No:- 9703152119

మహరాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. no.1057/2022 in O.S.no. 38/2022

Between :-

షేక్ ఇస్మాయేల్, షేక్ తరాభి ...పిటిషనర్లు/వాదులు

మరియు

షేక్ బాజీ మరియు 7 మంది

...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

శ్రీమతి తడువాయి శివపార్వతి, భర్త సుబ్బారావు, వయస్సు 40సం॥లు, తలుపు నెం. 1-127, కోనూరు గ్రామము, అచ్చంపేట మండలం, గుంటూరు / పల్నాడు జిల్లా, 520007 (5వ రెస్పాండెంట్)

పైదావాలోని పిటీషనర్లు/వాదులు, పైదావాలోని రెస్పాండెంట్లు / ప్రతివాదులలో 2వ రెస్పాండెంట్ / ప్రతివాది తేది.23-4-2022న 5వ రెస్పాండెంట్ / ప్రతివాదివైన నీకు దావా షెడ్యూలు ఆస్థిని గురించి నీ పేరున రిజిష్టరు తనఖా చేసియున్నారు. సదరు దస్తావేజును రద్దు పరచి మరియు మధ్యంతర ఉత్తర్వులు నిమిత్తమై పై కోర్టు వారి ఎదుట ఇందలి పిటీషనర్లు / వాదులు I.A. No.1057/2022 O.S.No. 38/2022ను దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టు వారు అనేక పర్యాయములు నీకు సమన్లు / నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పత్రిక ప్రకటన ద్వారా దావా నోటీసులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై నీకు ఏమైనను అభ్యంతరములు ఉన్నయెడల తేది. 22-10-2024 వాయిదా రోజున గం. 10:30 నిమిషములకు మీరుకానీ మీ న్యాయవాది ద్వారాగానీ హజరై మీకుగల అక్షేపణలు పై కోర్టు వారి ఎదుట తెలియపరచగలరు. లేనియెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా తేది:-22-10-2024

ఇట్లు
అయినంపూడి పవన్ కుమార్
వాదుల తరుపున న్యాయవాది, చీరాల,
Cell:- 9703152119

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో...

O.S No: 57/2013 E.P 2/2024

అచ్చుకోల బలరామయ్య ...డిహెచ్.ఆర్

And

జెడిఆర్.1) అచ్చుకోల ధనమ్మ & వగైరాలు

To,

జెడిఆర్.3) కూనపరెడ్డి లక్ష్మీ శివ పార్వతి w/o ఆంజనేయులు, విడదల వారి వీధి, పురుషోత్త పట్నం గ్రామం, చిలకలూరిపేట పట్టణం మరియు మండలం.

పై నెంబరు అమలు దరఖాస్తులో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను నోటీసులు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పై కోర్టు వారి ఎదుట ది. 29-10-2024వ తేదీ ఉదయం 10:30కు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేని యెడల మీ పరోక్ష మందు విచారించి తీర్మానం చేయబడును.

కోర్టువారి ఉత్తర్వులు మేరకు

వాయిదా ది.29-10-2024

పి.పాండురంగారావు,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది.

Notice

IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST.JUDGE::GUNTUR

M.V.O.P.No:194/ 2018

Between:

Ponugoti Ramulamma ... Petitioner

And

Palaparthi Samba Siva Rao & Others ... Respondents

To,

R-1: Palaparthi Samba Siva Rao, S/o.Venkateswarlu, Door No.12-157/2, Bapanaiah Nagar, Prakash Nagar, Narasarao Pet, Guntur Dist. Presently Palnadu Dist.(Driver of Innova No.AP 16 CH 9299)

పై నెంబరు O.P.ని పిటీషనరు యాక్సిడెంటులో పొనుగోటి వెంకట రామయ్య చనిపోయినందున నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటిషన్ లో 1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:14-10-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:14-10-2024

కళ్ళం వెంకట రమణా రెడ్డి,
పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు,

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో....

Dispute No: 148/2017 EP No:61/2022

M/S శ్రీ కల్పతరువు చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ చిలకలూరిపేట. Rep/its Fore men Mr.గుండాల వెంకటేశ్వరరావు. ... డి.హెచ్.ఆర్.

And

జెడిఆర్ 1) అన్నె నరేంద్ర కుమార్ & వగైరాలు

To,

జెడిఆర్.1) అన్నె నరేంద్ర కుమార్ S/o కృష్ణమూర్తి, వ్యాపారం, GSR టెక్స్‌టైల్స్, R/o నడింపాలెం పోస్ట్, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా.

2) అన్నె హేమ సుధారాణి w/o నరేంద్ర కుమార్, వ్యాపారం, GSR టెక్స్‌టైల్స్, R/o నడింపాలెం పోస్ట్, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు అమలు దరఖాస్తులో శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం మీకు ఎన్నిసార్లు అమలు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున ఈ పేపర్ నోటీసు ద్వారా పైకోర్టు వారి ఎదుట ది.24-10-2024 వ తేదీ ఉదయం 10:30కు మీరు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపరులు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానం చేయబడును.

శ్రీ పి పాండురంగారావు,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు.. నరసరావుపేట.

I.A. 438/2022 in O.S. 165/2018

ఎదిరి:

ఆవుల భాగ్యలక్ష్మి ...పిటిషనర్/వాది

మరియు

1) తోట నాగేశ్వరరావు మరియు ఇతరులు

..... రెస్పాండెంట్స్/ప్రతివాదులు.

R4) పిరిసెట్ల ధనలక్ష్మి w/o కోటి నాగేశ్వరరావు R/D No: 5-471/1, నరసరావుపేట సెంటర్, చిలకలూరి పేట పట్టణం, పల్నాడు జిల్లా.

మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేసి ఉన్నారు. కావున శ్రీ కోర్టు వారు ది.29-10-2024 న మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి ఉన్నారు. కావున తమరు సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు మీరు శ్రీ పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, లేదా న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం

వాయిదా:29-10-2024

ఇట్లు.
ఎస్.వి రమణా రెడ్డి, న్యాయవాది,
నరసరావుపేట, పల్నాడు జిల్లా.
సెల్ నెం.9908670264

సిపిఎం అభిమాని మౌనిక మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని ఈస్ట్ పల్లెకు చెందిన సిపిఎం అభిమాని సాతులూరి మౌనిక (33) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. మహిళా సంఘం నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే మౌనిక ఇతర ప్రజా సంఘాలు, సిపిఎం కార్యక్రమాలల్లోనూ పాల్గొనేవారు. ఆమెకు భర్త వీరబాబు సైతం సిపిఎం అభిమానే. మౌనిక భౌతికకాయాన్ని సిపిఎం పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్.బాబు, కె.నాగేశ్వరరావు, ఎస్.ప్రకాష్, టి.ప్రతాప్‌రెడ్డి, ఎస్.లూథర్, కె.రోశయ్య, బి.కోటానాయక్ సందర్శించి నివాళులర్పించారు.

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రేపు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని ఎం.వి.రెడ్డి కంటి వైద్యశాల సౌజన్యంతో ఇస్లాంపేట శ్రీగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే శిబిరంలో కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కొందరికి ఉచితంగా, మరికొందరికి రాయితీపై కళ్ళజోళ్ల పంపిణీ ఉంటుందని, ఆపరేషన్లు అవసరమైన వారికి రాయితీపై ఆపరేషన్లు చేస్తామని ఎంవి రెడ్డి ఐ హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి తెలిపారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు, కంటి ఆరోగ్యంపై అవగాహన సదస్సులెన్నో నిర్వహించామని పేర్కొన్నారు. వేలాది మందికి కంటి శస్త్ర చికిత్సలు విజవంతమయ్యాయని తెలిపారు.

మాదలలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

సిపిఎం మాదల మూడవ శాఖ మహాసభ జవ్వంగుల బాబురావు అధ్యక్షతన గురువారం జరిగింది. గ్రామంలోని ఒకటి, రెండు, మూడవ వార్డుల్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మహాసభ డిమాండ్ చేసింది. శ్మశానవాటికలో కంపచెట్లు పెరిగి మృతదేహాలను తీసుకువెళ్లేందుకు కూడా వీల్లేకుండా తయారైందని, సత్వరమే శుభ్రం చేయించడంతోపాటు అందులోని నీటి పంపులను బాగు చేయించాలని కోరుతూ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. అనంతరం శాఖ నూతన కార్యదర్శిగా గారా జాలయ్యను ఎన్నుకున్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

వానొస్తే విపత్తే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కొద్దిరోజులుగా అప్పుడప్పుడూ పడుతున్న జల్లులు మిర్చికి మేలు చేస్తుండగా పత్తిపైరుకు మాత్రం కీడు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. మండలంలో ఈ ఏడాది 2 వేల ఎకరాలకు పైగా పత్తి సాగైంది. 60-90 రోజుల దశలో పైర్లున్నాయి. ఒక్కో మొక్కకు 50-60 వరకూ కాయలు పడగా వీటిల్లో 20-35 వరకూ పూత నుండి కాయగా మారే దశలో ఉన్నాయి. మొక్కకు అడుగుభాగాన పెద్దకాయలుండగా వీటిల్లో కొన్ని పగిలి పత్తి బయటకు వస్తోంది. తాజా వానలతో ఇవి దెబ్బతింటాయని, పైరుకు తెగుళ్లు సైతం ఆశిస్తాయని రైతులు కంగారు పడుతున్నారు. వర్షం లేకుండా ఎండలొస్తే కాయలు పగిలి పంట వస్తుందని చెబుతున్నారు. ఇది జరిగితే ఎకరాకు కనీసం 9 క్వింటాళ్లు, గరిష్ఠంగా 15 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం క్వింటాళ్‌కు రూ.9350 మద్దతు ధర ప్రకటించగా ప్రస్తుతం మార్కెట్‌లో రూ.9500 వరకూ కొనుగోలు చేస్తున్నారు. ఇదే కొనసాగితే తమకు కాస్తంత ఆదాయం వస్తుందని రైతులు భావిస్తున్నారు.

మానుకొండవారిపాలెంలోని పత్తిపాలెం

మండలంలో నల్లరేగడి భూములు కావడంతో నీటి నిల్వ సామర్థ్యం ఎక్కువగా. వర్షం వస్తే నీరు నిలిచి మొక్క ఏరు కుళ్లిపోతుందని, ఆకులు, పూత రాలిపోతుందని రైతులు ఆందోళనగా ఉన్నారు. గత ఆగస్టులో వర్షాలకు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని, వారం పదిరోజులుగా అప్పుడప్పుడు జల్లులు పడుతుంటే భయంగా ఉందని అంటున్నారు. ఇదిలా ఉండగా వాతావరణం చల్లగా ఉండడం వల్లకూడా పైరుకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. ఇప్పటికే పచ్చదోమ ఉధృతితో రైతులు అల్లాడుతు న్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయా ధికారులు సరైన సలహాలు ఇవ్వడంతోపాటు అవసరమైన మందులను సబ్సిడీపై ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పారిశుధ్యం పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని డ్రెయినేజీ సమస్యపై ఎమ్మెల్యేకు నాలుగు రోజుల కిందట నిర్వహించిన ప్రజాదర్బార్‌లో విన్నవించినా పరిష్కరించలేదని సిపిఎం కార్యదర్శి బి.సూరిబాబు విమర్శించారు. సిపిఎం కార్యాలయం వద్ద నేతుల నరసింహారావు గృహంలో వాడుకుంటున్న మురుగనీరు, పశువుల వ్యర్థాలను రహదారిపైకే వదిలేస్తున్నారని పేర్కొన్నారు. ఈ మార్గంలో నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారని, సభలు, సమావేశాలకు పలు రంగాల ప్రజలు వస్తుంటారని, వీరంతా దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిత్యం పారిశుధ్యం ప్రకటనలు చేసే అధికారులు, ప్రజాప్రతినిధులకు మాత్రం ఈ సమస్య పట్టడం లేదని విమర్శించారు. సిసి రహదారిపై అడ్డంగా పెట్టిన రాళ్లనూ తొలగించాలని కోరారు.

సిరిమాను ఉత్సవం ఊరేగింపు

వైభవంగా జమ్మలమడక తిరునాళ్ల

సిరిమాను ఉత్సవంలో పాల్గొన్న మాచర్ల, గిద్దలూరు ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

మాచర్ల మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో నిర్వహిస్తున్న ముత్యాలమ్మ జాతరలో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితో కలిసి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. గురువారం నిర్వహించిన సిరిమాను ఉత్సవంలో ఇరువురు ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ తిరునాళ్ళు వైభవంగా జరిగింది. ఎమ్మెల్యేలను సత్కరించారు. ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు రైతులు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలోని మాచర్ల మాజీ ఎమ్మెల్యే చల్లా నారపరెడ్డి కలిశారు. నాయకులు కె.శివారెడ్డి, జె.అక్కిరెడ్డి, కె.దుర్గారావు, పి.పుల్లయ్య, ఎన్.వీరస్వామి, కె.కోటేశ్వరరావు, జి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలు తెలుసుకుందాం.. బాలికలను కాపాడుకుందాం..

ప్రజాశక్తి - కారంపూడి

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహిళలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గృహహింస చట్టం, వరకట్న వేధింపులు, మహిళలపై వేధింపులు, మహిళా సంబంధిత చట్టాలు గురించి రిసోర్స్ పర్సన్ ఎస్‌బిఎ ఝాన్సీ వివరించారు. షేక్ అమీనా రెహమాన్ మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్, ఎన్నారై వివాహాలు, మానవ అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్ మరియు పని ప్రదేశాలలో మహిళలపై వేధింపులు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసిందన్నారు. చట్టాల గురించి అవగాహన కలిగి ఉండటమే కాకుండా తమ చుట్టుపక్కల వారికీ చెప్పాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయము, లోక్ అదాలత్ గురించి గురజాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మందపాటి శ్రీనివాసరెడ్డి అవగాహన కల్పించారు. ప్యానెల్ లాయర్ కె.హరి సత్యనారాయణ, అంగన్వాడీలు, ఆశా వర్కర్స్, డ్వాక్రా మహిళలు, వెలుగు కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని అమరావతిలో నిర్వహించిన కార్యక్రమానికి సంస్థ సామాజిక కార్యకర్త తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ ఫాదర్ భాస్కర్ మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకొని వారి కాళ్ల మీద వారు ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తల్లిదండ్రులు సైతం ఆడ పిల్లల్ని మగపిల్లలతో సమానంగా చూడాలన్నారు. అంగన్వాడి సూపర్వైజర్ ఇమాంబి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చెప్పారు. తాడికొండ సూపర్వైజర్ భారతి మాట్లాడుతూ విద్య హక్కు చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడికి వెళ్లాలన్నారు. సంస్థ సుపీరియర్ సిస్టర్ విన్నారా సి మాట్లాడుతూ ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098కి సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల సాధికారతంటూ చెబుతున్నా మహిళలు ఏమి చేయాలో కూడా పురుషులే నిర్ణయిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఈ ధరణి మారాలన్నారు. పిల్లల్ని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ ఆరోగ్యమేరి, సిస్టర్ గ్రేసి, సిస్టర్ డియానా, సిబ్బంది బాలికలు మహిళలు పాల్గొన్నారు.

ఈపిఎఫ్ కార్యాలయంలో

14న పెన్షన్ అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కృష్ణ నగర్‌లోని భవిష్యనిధి కార్యాలయంలో ఈనెల 14న, ఉదయం 11 గంటల నుండి జరిగే పెన్షన్ అదాలత్‌లో గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల పెన్షనర్లు తమ ఫిర్యాదులు నేరుగా అందచేయవచ్చని కార్యాలయ అధికారులు ఒక ప్రకట నలో తెలిపారు. కార్యాలయానికి నేరుగా రాలేకపోతే ఆన్‌లైన్‌లో ఈమెయిల్ ద్వారా వాట్సాప్ ద్వారా కూ ఫిర్యాదులు పంపించ`వచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగిం చుకోవాలని కోరారు. ఫిర్యాదులను ro.guntur@epfindia.gov.in ఈమెయిల్ కుగానీ, 94946 57469 నంబరుగా వాట్సాప్ ద్వారాగానీ ఫిర్యాదులు పంపవచ్చన్నారు.

అంత్య క్రియలకూ అవస్థలే...

పాలకులు మారినా తీరని శ్మశానవాటిక సమస్య


పనిచేయని బోరింగ్ పంపు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లికి శ్మశాన వైరాగ్యం పట్టిపీడిస్తోంది. ఎంటిఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణంలో ప్రస్తుతం సుమారు లక్ష జనాభా నివసిస్తున్నారు. ప్రజలకు అవసరం అయిన స్మశానం మాత్రం ఇంతవరకు పాలక పార్టీలు ఏర్పాటు చేయకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఎవరైనా చనిపోతే దశదిన కార్యక్రమాలు నిర్వహించటానికి సరైన స్మశానం లేదు. దీంతో రోడ్డు పక్కన, లేదా కృష్ణా నదిలో చనిపోయిన వ్యక్తులకు దహన సంస్కారాలు నిర్వహించ వలసి వస్తుంది. పోనీ ఎక్కడైనా సరైన సౌకర్యాలు ఉన్నాయా అంటే అవి ఎండమావిగానే కనిపిస్తున్నాయి. ఎన్నికల సందర్భంగా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన నాయకులు తాడేపల్లిలో స్మశానం నిర్మించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత తాడేపల్లిలో ఎవరైనా చనిపోతే అమరారెడ్డి నగర్ దాటిన తర్వాత రోడ్డు పక్కన ఉన్న సెంటు స్థలంలో దాహన సంస్కారాలు నిర్వహి స్తున్నారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత కనీ సం కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడానికి కూడా అక్కడున్న బోరింగ్ పంపు పని చేయటం లేదు. ఫలితంగా కిలోమీటర్ దూరం నడిచి వచ్చి బకింగ్ హామ్ కాలవ పక్కన దాతలు నిర్మించిన రేకుల షెడ్డు పక్కన ఏర్పాటు చేసిన పంపు దగ్గరే శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో సిపిఎం తాడేపల్లి పంచాయతీ అధికారంలో ఉన్న సమయంలో స్మశాన నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. ఆ ప్రయత్నాలను అప్పటి కాంగ్రెస్ నాయకులు, ఇప్పటి వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఫలితంగా గత 20 సంవత్స రాలుగా తాడేపల్లి లో స్మశాన నిర్మాణానికి ముందుకు వచ్చిన పాలక పార్టీలే లేక పోవడం పట్ల పట్టణ ప్రజలు అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎం టి ఎం సి పరిధి లోని తాడేపల్లిలో పన్నుల రూపంలో సంవత్సరానికి కోట్ల రూపాయల ఆదాయం వచ్చి చేరుతుంది. అయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సందాన వెక్కిరిస్తుంది. ఆఖరి మజిలీ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

పొక్లెయినర్‌తో తవ్వుతున్న కందకాలు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - తుళ్లూరు

ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. కృష్ణా నది లోని ఇసుక రేవులలోకి వాహనాలు వెళ్లకుండా ఉద్దండ రాయునిపాలెం - లింగాయపాలెం మధ్య పోలీసులు గురువారం ప్రొక్లయినర్‌తో కందకాలు తవ్వించారు. పోలీసుల కళ్లుగప్పి మరీ అక్రమార్కులు ఇసుకను తరలిస్తుం డడంతో ఇప్పటికే బోరుపాలెం ఇసుక రేవు మార్గంలో కందకాలు తవ్వించారు.అదేవిధంగా ఉద్ధండరాయునిపాలెం - లింగాయ పాలెం మధ్య సిఐ గంగా వెంకటేశ్వర్లు దగ్గరుండి కందకాలు తవ్వించారు. అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకుంటామని సిఐ హెచ్చరించారు.

అంధత్వం ప్రతిభకు అడ్డం కాదు

ప్రొఫెసర్లకు జాతీయ పురస్కారాలు అందజేత

అవార్డు పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, లక్ష్మణరెడ్డి, నిర్వాహకులు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పుట్టుకతో అంధులుగా ఉంటూ అత్యున్నత స్థాయికి ఎదిగిన వారికి శ్రీ పబ్బరాజు వెంకటేశ్వరావు, రాజ్యలక్ష్మి స్మారక మానవసేవ జాతీయ పురస్కారం - 2024 గురువారం గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లోని బాలాజీ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంధులైనప్పటికీ ఉంటూ హైదరాబాదులోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ లో ఇంగ్లీషు ప్రొఫెసర్ గా పనిచేస్తున్న విజ్జేస్వరపు రాజశేఖర్, శ్రీ లాల్ బహుదూర్ శాస్త్రి నేషనల్ సంస్కృత యూనివర్సిటీలో వ్యాకరణం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జార్ఖండ్‌కు చెందిన దయాల్ సింగ్ పన్వార్‌లకు జాతీయ పురస్కారాలు, రూ.లక్ష చొప్పున నగదు అందజేశారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ గుంటూరు కలెక్టరేట్ లో తహసీల్దారుగా పనిచేసిన పబ్బరాజు వెంకటేశ్వరరావు 1993లో ఉద్యోగ విరమణ అనంతరం అంధులకు విద్యనందించాలన్న లక్ష్యంతో శ్రీ షిరిడి సాయి దీనజన సేవా సమితిని స్థాపించి, వందలాది అంధులకు విద్యను అందించిన మహనీయులు అని కొనియాడారు. వీరిలో దాదాపు వందమందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించడం గమనార్హం అన్నారు. లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ వెంకటేశ్వరరావు పదవీ విరమణ అనంతరం 25 సంవత్సరాల పాటు అంధ విద్యార్థుల అభివృద్దే లక్ష్యంగా పనిచేశారన్నారు. పబ్బరాజు మరణానంతరం వెంకటేశ్వరరావు రాజ్యలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత మూడు సంవత్సరాలుగా స్మారక మానవ సేవా జాతీయ పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ఛైర్మన్ ఆనంగి పూర్ణ చంద్రరావు ప్రసంగిస్తూ అంధుల, వికలాంగుల, అనాధల సేవలో నిమగ్నమైన వ్యక్తులకు, దివ్యాంగులై ఉండి విద్యావంతులై ఉన్నత ఉద్యోగం పొంది ఉన్నవారికి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున 2022 సంవత్సరం నుండి జాతీయ పురస్కారాలు అందిస్తున్నామన్నారు. పురస్కార గ్రహీతలు ప్రొఫెసర్ విజ్జేస్వరపు రాజశేఖర్, ప్రొఫెసర్ దయాల్ సింగ్ పన్వార్ లు స్పందిస్తూ అంధుల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామన్నారు. చీరాలకు చెందిన అధ్యాపకులు రావి మోహన్ రావు రూ.లక్ష చెక్కును శ్రీ షిరిడి సాయి దీనజన సేవా సమితికి విరాళంగా అందించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్టర్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య, అమెరికాలో స్థిరపడిన పబ్బరాజు వెంకటేశ్వరరావు కుమారుడు పబ్బరాజు వెంకట రమణ మూర్తి, హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. యన్. దీక్షిత్, శ్రీ షిరిడి సాయి దీనజన సేవా సమితి కార్యదర్శి. పి. స్. మూర్తి, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ప్రసంగించారు.

16 నుంచి నూతన మద్యం విధానం

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అరుణకుమారి

ప్రజాశక్తి - తెనాలి

కొత్త మద్యం పాలసీలో షాపుల కేటాయింపుకు దరఖాస్తు గడువు ఈనెల 11 సాయంత్రంతో ముగుస్తుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి వి అరుణ కుమారి చెప్పారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన ఆమె కొత్త మద్యం పాలసీ అమలు తీరు, దరఖాస్తు విధానం, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తులు తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 127 మద్యం దుకాణాల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానించినట్టు చెప్పారు. ప్రస్తుతానికి 2999 దరఖాస్తులు అందాయని, శుక్రవారం సాయంత్రం వరకు గడువు ఉన్న నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 14న లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు జరుగుతుందన్నారు. షాపులు దక్కించుకున్న వారు 16 నుంచి వ్యాపారాలు నిర్వహించవచ్చునని చెప్పారు. అదే రోజు నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త మద్యం పాలసీ జిల్లాలో అమలవుతుందని ఆమె స్పష్టం చేశారు. షాపుల నిర్వహణకు బడి, గుడి, మసీదులకు కనీసం 100 మీటర్ల దూరం విధిగా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సందేశాత్మకంగా నాటక ప్రదర్శనలు

నాలుగో రోజుకు చేరిన వీణ అవార్డ్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి

మా ఇంట్లో మహాభారతం నాటికలో సన్నివేశం

స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న వీణ అవార్డ్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. పట్టణానికి చెందిన కళల కాణాచి, విజయవాడకు చెందిన వేద గంగోత్రి ఫౌడేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేస్తున్నాయి. పౌరాణిక పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు, నాటికలే ఏ ఒక్కటీ మినహాయింపు కాదన్న రీతిలో సాగుతున్నాయి. నటీనటులు అభినయంలో పోటీ పడుతున్నారు. అభినయానికి తగిన ఆహార్యం, రంగాలంకరణ, సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుటుంది. ప్రతి రోజు నాలుగు ప్రదర్శనలనూ తిలకించేవారు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. నాలుగో రోజు ప్రదర్శనల్లో తొలుత కళాంజలి హైదరాబాద్ వారి 'యుద్ధం' సమకాలీన సాంఘిక పద్య నాటకం ప్రదర్శించారు. నాటకానికి రచన ఆకురాతి భాస్కర చంద్ర, పద్య రచన డాక్టర్ బొక్కా శ్రీనివాసరావు, దర్శకత్వం కొల్లా రాధాకృష్ణ. రెండో ప్రదర్శనగా విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ వారి '27వ మైలు రాయి' ప్రదర్శించారు. పిటి మాధవన్ రచనకు ఆర్ వాసుదేవరావు దర్శకత్వం వహించారు. మూడో ప్రదర్శన హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారి 'ఇది రహదారి కాదు' సాంఘిక నాటిక, నాల్గవ ప్రదర్శనగా చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ వారి 'మా ఇంట్లో మహాభారతం' సాంఘిన నాటికలను ప్రదర్శించారు.

యదార్థ ఘటన ఆధారంగా 27వ మైలు రాయి నాటకం

27వ మైలు రాయి నాటకలో 1993లో జరిగిన యదార్ధ ఘటన ఆధారంగా రాసిన నాటకం. న్యాయ వాదులు సమాజాకి కీడు చేసే కేసులు వాదించకూడదన్న సందేశమే నాటిక ఇతివృత్తం. క్రిమినల్ లాయర్ రంగనాధాన్ని ఎవరో కత్తితో పొడుస్తారు. ఆయనను ఎవరి పొడిచారు, ఎందుకు పొడిచారన్నది తెలియదు. కాని పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తుంటారు. అదే సమయంలో ఆయన కుమార్తెను మర్డర్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. ఆ కేసులో కుమార్తె బెయిల్ కోసం రంగ నాధం నానా తంటాలు పడుతుంటాడు. అదే సమయంలో అతని ఆఫీసుకు వచ్చిన ఇద్దరు వ్యక్తుల ద్వారా గతంలో రంగనాథం అడ్డగోలుగా వాదించిన కేసుల ఫలితమే అతనిపై దాడి, కుమార్తె మరో కేసులో ఇరుక్కోవ టానికి కారణంగా తెలుసుకుని సమాజానికి కీడు చేసే కేసులు వాదించకూడదని రంగనాథం నిర్ణయించు కుంటాడు.

27వ మైలురాయి నాటకంలో సన్నివేశం

రక్తి కట్టించిన మా ఇంట్లో మహాభారతం

నాటకోత్సవాల్లో చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన నాటిక 'మా ఇంట్లో మహాభారతం' రక్తి కట్టించింది. కథాంశాన్ని పరిశీలిస్తే రామంచంద్రరావు, అన్నపూర్ణ దంపతులకు 36 ఏళ్ళ ఉద్యోగం లేని కొడుకు వాసు ఉంటాడు. 40 ఎకరాల పొలం ఉన్నా, ఉద్యోగం లేని కారణంగా వాసుకు వివాహం గగనమౌతుంది. అయితే ఆయన వివాహం కోసం పెళ్ళిళ్ళ బ్రోకర్ అడే నాటకం, అందమైన యువతి అని అన్ని అవలక్షణాలున్న యువతితో వివాహం జరగటం, ఫలితంగా కుటుంబం యావత్తూ ఎదుర్కొనే ఇబ్బందులు ఇది వృత్తంగా మా ఇంట్లో మహాభారతం నాటిక సాగుతుంది. కార్యక్రమాలను కళల కాణాచి బృందం బుర్రా సాయిమాధవ్, చెరుకుమల్లి సింగారావు, గోపరాజు విజయ్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, వెంకట్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : చినకాకాని దీన్‌దయాళ్ నగర్‌లో డ్రైనేజీ మెరుగు పరచాలని, రజకుల చెరువును అక్రమణలకు గురి కాకుండా కాపాడాలని, మంచినీరు అందించాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని సిపిఎం చినకాకాని శాఖ మహాసభలు తీర్మానం చేశాయి. గురువారం చినకాకానిలో గ్రామ ఒకటి, రెండవ శాఖ మహాసభలు సిపిఎం నాయకులు వి పూర్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు ప్రసంగించారు. ముందుగా నాయకులు సీతారాం ఏచూరి, ఏటుకూరు గంగాధరరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం 1వ శాఖ కార్య దర్శిగా వత్రం పూర్ణయ్య, రెండవ శాఖకు గండికోట బాబు వర ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. మహాసభలో టి బ్రహ్మయ్య, జి శ్రీని వాసరావు, వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. మహాసభ జెండాను నాయకులు కాజ శివశంకరావు ఎగురవేశారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక గణపవరంలో పారిశుధ్య సమస్యలు దారుణంగా పెరుగుతున్నాయి. చెత్తాచెదారాన్ని సమర్థంగా తొలగించకపోవడం వల్ల చిన్నపాటి చినుకులకే నీళ్లు ఎక్కడికక్కడే ఆగిపోతున్నాయి. కాల్వల్లో పూడికతీత పనులు చేయకపోవడం వల్ల మురికి నీళ్లు పోకుండా ఆగిపోతున్నాయన్నారు. మూడు నెలలుగా శుభ్రం చేయకపోవడంతో మురికికాల్వ నుండి దుర్వాసన వెదజల్లుతోందని5వ వార్డు సచివాలయం వెనక బజారులోని ప్రజలు వాపోతున్నారు. పేరుకుపోయిన చెత్తకుప్పల్లో కుక్కలు అటుఇటు దొర్లుతూ చెల్లాచెదురు చేస్తున్నాయని, వీచే గాలికి ఇళ్లలోక్కి చెత్త వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికికాల్వ నీళ్లు మంచినీటి పైపుల్లోకి కలుషితం కావడం కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. శానిటేషన్ సిబ్బంది స్పందించి కాల్వలను శుభ్రం చేసి, మురుగు పారుదల అయ్యోల చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఎన్ఆర్ఐ కృష్ణప్రసాద్ సేవలు అభినందనీయమని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణవాసి అమెరికాలో నివాసం ఉంటున్న ఉన్నం వెంకటకృష్ణప్రసాద్ తన మనవడు వియాన్‌శేఖర్ ఐదో పుట్టినరోజు సందర్భంగా అన్నదాన సేవాకార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ళ రమేష్, తుమ్మేపల్లి సాంబశివరావు, పివిఆర్ యాదవ్, ఓరుగంటి చెన్నకేశవరావు, ఆదివిష్ణుయాదవ్, మార్క్, ఉప్పు ప్రసాదు, వాసు, కృష్ణ పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటాకు టిడిపి పట్టణ వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో గురువారం నివాళులు అర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ రతన్‌టాటా జీవితం దేశానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మద్ది వెంకటేశ్వరావు, కార్యదర్శి దేవరపల్లి ఖాసీ, సురే ప్రసాద్, పోతుగంటి రామాకోటేశ్వరావు, దివ్వెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రికార్డులు అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

ఎరువులు, పురుగు మందుల దుకాణ దారులు రికార్డులను తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని షాపుల నిర్వాహకులకు ఏవో శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని పలు పురుగు మందులు, ఎరువుల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రసీదులను రైతులు పంట కాలం పూర్తయ్యే వరకూ దాచుకోవాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

బస్సు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి-విజయవాడ మధ్యలో ఉన్న రాష్ట్రసచివాలయానికి, ఉన్నతాధికారుల కార్యాలయాలకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులుపాలవుతున్నారని సిపిఐ నాయకులు భైరాపట్నం రామకృష్ణ శరణం, విజయ, కె.చెన్నకేశవరావులు ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలోని సిపిఐ కార్యాలయ సమావేశంలో వారు మాట్లాడుతూ అమరావతి నుండి విజయవాడ మెట్రో సర్వీసులు ఉంటే గంటన్నర సమయం పడుతుంది అందువల్ల అమరావతి నుండి విజయవాడ అమరావతి నుండి సచివాలయం ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెట్రో పల్లె వెలుగు బస్సులు విజయవాడ డిపో వారు నడిపే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని కొత్త పుల్లారెడ్డి గూడెంకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన 60 కుటుంబాల వారు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి టిడిపి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. క్షణికావేశంలో వివాదాలకు పోయి జీవితాలు పాడు చేసుకోవద్దని, పరస్పరం సహకరించుకుంటూ గ్రామాలను అభివృద్ధి పథంలోకి నడిపించుకోవాలని వారికి సూచించారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసనకు సంఘీభావం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట ఆవిర్భావన, పట్టణీకరణ విస్తరణ నేపథ్యంలో మున్సిపల్ కార్మికులను ఉద్యోగులను పెంచాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ రాజకీయ వేధింపులు పేరిట ఉద్యోగులను తొలగించడం వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధులకు అధికారులకు తగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ అన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులను నిర్ధాక్ష్యాణ్యంగా ఆగస్టు మొదటి తేదీ నుండి రాజకీయ వేధింపులలో భాగంగా మున్సిపల్ కమిషనర్ విధులనుండి తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నిరసనకు ఎంసిపిఐయు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్‌బాష సంఘీభావం తెలిపారు. అనంతరం తక్షణమే తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు.యూనియన్ ఇంజనీరింగ్ విభాగం పట్టణ అధ్యక్షులు షేక్ చిన్న అల్లాబక్షు, ఉద్యోగులు బత్తుల నాగమల్లేశ్వరి, శివరాత్రి రమాదేవి, షేక్ మహబూబ్ సుభాని, షేక్ మహబూబ్ బాషా, షేక్ సైదా, పోలూరి రమణ, షేక్ మహబూబ్ సుభాని, షేక్ షైలు,అక్కి పద్మ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శుద్ధజల కేంద్రం పునఃప్రారంభం

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు తాగునీటి చెరువు ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ శుద్ధజలకేంద్రాన్ని గురువారం పునఃప్రారంభించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచన టిడిపి నేతలు తెరిపించారు. వైసిపి హయాంలో మూలనపడ్డ ఈ కేంద్రంలో పరికరాలు పూర్తిగా పాడవ్వటంతో రూ.మూడులక్షల పైచిలుకు నిధులతో వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో నేతల కృషికి గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. ఈ శుద్ధజలకేంద్రం పునఃప్రారంభంలో పెదకూరపాడు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, టిడిపి జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ గోపాలరావు, గల్లా బాబు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షులు వడ్లమూడి అప్పారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ముంతాజ్ అంద్ర ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి బుల్లిబాబు, ఉన్నవ గంగాధర్, బెల్లంకొండ శేషగిరిరావు, కాల్వ అప్పారావు, మొహిద్దీన్ బచ్చా, తెలుగు యువత గల్లా శివ నాగరాజు కీలకంగా ఉన్నారు. 20లీటర్ల నీటిని రూ.ఐదుకే అందిస్తామని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని నేతలు కోరారు.

విద్యను కార్పొరేట్లకు తాకట్టు పెట్టడం తగదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నీట్, ఐఐటి ఉచిత శిక్షణను నారాయణ విద్యా సంస్థ ద్వారా ఇస్తున్నామని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రకటించడం ప్రభుత్వ విద్యను తాకట్టు పెట్టడమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట సాయి కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షపండులా మారిందని ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో బాగా చదువుతున్న విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్ష పెట్టి అందులో ఎంపికైన విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం చూస్తే గొర్రె కసాయోడి చేతికి చిక్కినట్టేనని విమర్శించారు. ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల నిజంగా ప్రేమ ఉంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాకు ఒకటి సెంటర్ ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో నెల్లూరు, కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం ఈ జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రక్రియ ప్రారంభించిందని తక్షణమే ఈ విధానం నిలిపివేయాలని లేని పక్షంలో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో నారాయణ విద్యాసంస్థల ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వైసిపి దుష్ప్రచారం మానుకోవాలి: ఎమ్మెల్యే జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

టిడిపి ప్రభుత్వంపై వైసిపి దుష్ప్రచారాలు మానుకోవాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన బొల్లాపల్లి ఎంపిడిఓ కార్యాలయంలో సర్వసభ్యసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని పలు సమస్యలపై చర్చించి శాఖల వారీగా అధికారులందరికీ సూచనలు, దిశానిర్దేశాలు చేశారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసి పనిచేసి బొల్లాపల్లి మండలాభివృద్ధికి తోడ్పాడాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వరదబాధితుల విరాళాల విషయంలో వైసిపి దుష్ప్రచారాన్ని దుయ్యబట్టారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జరపాల గోవింద నాయక్, నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, దాసరి కోటేశ్వరరావు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఎలిసెట్టి రంగయ్య పాల్గొన్నారు.

బాలోత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

డిసెంబర్ 13, 14 తేదీలలో నిర్వహించనున్న పల్నాడు బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవాల కమిటీ సభ్యులు తమ వంతు కృషి చేయాలని పల్నాడు బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ సమావేశం కమిటీ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వెయ్యిమంది దాతలచే దరఖాస్తులు పెట్టించే కార్యక్రమం చేపట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. అదేవిధంగా రేపు (అనగా శనివారం)ఎంవి రెడ్డిఐ హాస్పిటల్ సౌజన్యంతో నరసరావుపేట పట్టణం ఇస్లాంపేట శ్రీగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోనేలా చూడాలన్నారు.

తహశీల్దార్ దాసుకు ఘననివాళి

ప్రజాశక్తి- మాచర్ల

ప్రకాశం జిల్లా అర్ధవీడు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కుక్కముడి దాసు బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వస్థలమైన మాచర్ల నియోజకవర్గం నుంచి విధులకు హాజరయ్యేందుకు అర్ధవీడుకు వెళుతుండగా మార్గమధ్యలో దాసు గుండెపోటుకు గురయ్యారు. ఆయన మృతిపట్ల గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వెల్దుర్తి మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డితో పాటు ఎంఆర్ఓ కె.దాసు భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట మండలంలో విశ్రాంతి ఉపాధ్యాయులు జయంతిబాబు గురువారం మృతి చెందారు. పలువురు నేతలు మాట్లాడుతూ మృతుడు జయంతిబాబు యుటిఎఫ్‌లో పని చేశారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడేవారని అన్నారు. అలాంటి వ్యక్తి మనమధ్యలో లేకపోవడం బాధాకరమన్నారు. అనంతరం ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ప్రపంచ దృష్టి దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఊటుకూరు ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవంపై అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎల్‌వి.ప్రసాద్ కంటిఆస్పత్రి కో-ఆర్డినేటర్ బత్తుల మల్లేష్ మాట్లాడుతూ నేత్రదానం చేద్దాం, అందరూ వెలుగును చూసేలా చేద్దాం అని అన్నారు. మేనరికం పెళ్ళిళ్ల పిల్లలకు అంధత్వాన్ని అంగవైకల్యాన్ని కలిస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ధనుష్ మాట్లాడుతూ షుగర్ వ్యాధిని నియంత్రించుకోకపోతే కంటిలో ఉన్న నాడి పొర చెడిపోతుందని అంధత్వం వస్తుందని అన్నారు.ఈ సదస్సులో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది, విజన్ టెక్నీషియన్ జాన్ షైదా పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తులకు నేడు ముగింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ముగియనుంది. గురువారం రాత్రి 10 గంటలకు అందిన సమాచారం గుంటూరు జిల్లాలో 127దుకాణాలకు గాను 3237 దరఖాస్తులు రాగా పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 1828 దరఖాస్తులు వచ్చినట్టు అధికార వర్గాలు తెలిపాయి. రెండు జిల్లాల పరిధిలో అన్ని దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 5065 దరఖాస్తులు రాగా వీటి ద్వారా ఒక్కో దుకాణంకు రూ.2 లక్షల రుసుము కింద ప్రభుత్వానికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో దరఖాస్తులు తక్కువ రాగా గుంటూరు జిల్లాలోనే వ్యాపారుల మధ్య గట్టి పోటీ ఉన్నట్టు తెలిసింది.

15న పీడీ ఆఫీసు వద్ద అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 15వ తేదీ గుంటూరు స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో జిల్లాలోని అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు ఏవిఎన్ కుమారి పిలుపునిచ్చారు. జి.ప్రేమలత అధ్యక్షతన పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో జరిగిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో హెల్పర్లను వర్కర్లుగా నియమించేందుకు అవసరమైన ప్రక్రియ చేపట్టి, ఏడాది గడుస్తున్నా ఇంతవరకు వారికి పోస్టింగులు ఇవ్వలేదని, సంవత్సరాల తరబడి వర్కర్లు, హెల్పర్లు, పోస్టుల ఖాళీగా ఉండటంతో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు అందించే సేవలు కుంటుపడుతున్నాయన్నారు. జిల్లాలో అనేక కేంద్రాలు ప్రభుత్వ భవనాలలో ఉన్నా వాటికి మరుగుదొడ్ల ఏర్పాటు జరగలేదని, కొన్నిచోట్ల స్థలాలు కేటాయించి, భవనాల నిర్మాణం చేపట్టలేదని అన్నారు.నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ప్రభుత్వం ఇచ్చే మొత్తంలో ఎలాంటి మార్పు లేదని, దీనివల్ల అంగన్వాడీలు తమ జీతాల నుండి పెద్ద మొత్తంలో అదనపు ఖర్చులు భరించాల్సి వస్తున్నదని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

మాట్లాడుతున్న ఎవిఎన్ కుమారి, వేదికపైన వై నేతాజీ తదితరులు

వై నేతాజీ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాలకు మిగతా జీవోలు ఇంతవరకు విడుదల చేయలేదని దీనివల్ల ఈకాలంలో చనిపోయిన అంగన్వాడీల కుటుంబాలకు మట్టి ఖర్చులు ఇచ్చే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. అంగన్వాడీల యూనియన్ నాయకత్వంతో రాష్ట్ర, స్థానిక సమస్యలపై తక్షణమే అధికారులు చర్చలు జరపి పరిష్కారం చేయాలని, ప్రభుత్వం అంగన్వాడీల వేతన పెంపుదలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా, ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు కె.హేమలత, జి.ప్రేమలత, కె.రత్నకుమారి, ఎం.ఆదిలక్ష్మి, కె.మాధవి, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు

రతన్‌టాటాకు పలువురు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతికి మంగళగిరి ఎకోపార్క్‌లో ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ది మంగళగిరి వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు. పుప్పాల కోటేశ్వరావు, ఉపాధ్యక్షులు. యు.పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి వీసం వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి, అంకం శ్రీనివాసరావు, కోశాధికారి గోలి బాలమోహన్, అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మహాత్మా గాంధీ కాలేజిలో అవర్ స్టేట్ అవర్ లీడర్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు ఫోరం అధ్యక్షులు జి.శాంతమూర్తి అధ్యక్షతన రతన్ టాటా మృతికి నివాళి అర్పించారు. డిఎఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వ్యాపారవేత్తల కంటే రతన్ టాటా విలువలతో కూడిన వ్యాపారం చేశారన్నారు. నాసా సైంటిస్ట్ చందు సాంబశివరావు మాట్లాడుతూ రతన్ టాటా గొప్ప మానవతా విలువలు కలిగిన వ్యక్తిగా జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి పేరు సంపాదించారని, ప్రజల అవసరాన్ని బట్టి వస్తువులను తయారు చేసేవారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, అవర్ స్టేట్ అవరు లీడర్ ఇండియన్ ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లి

మానసిక-శారీరక ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12 13 తేదీల్లో తాడేపల్లి సుందరయ్య నగర్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కళ్ళం రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రముఖ ఫ్రీక్వెన్సీ జెరిపిస్ట్ డాక్టర్ రావి నారాయణ. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లాఫింగ్ థెరిపిస్ట్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొంటారని చెప్పారు. సమాజంలో ప్రతిఒక్కరూ ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారని, మనిషి తీవ్రమైన ఆలోచనలే సమస్యకు మూల కారణమని అన్నారు. మనిషి ఆలోచనలు, నమ్మకాలు, పని విధానం, సమస్యను చూసే దృష్టి కోణం మనిషి ఆలోచనలను ప్రభావితం చేస్తాయన్నారు. తినే ఆహారం మీద కొంత నియంత్రణ సాధించడం ద్వారా రోగాలు దరిచేరవన్నారు. ఆర్థికంగా కన్నా ఆరోగ్యం మిన్న అనే సూక్తిని పాటిస్తే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఎంత సంపాదించాం అనేదానికంటే ఈ సమాజానికి ఏమి చేశాం అనే ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరారు.

'మళ్లీ దారుణాలు పడగ'పై అధికారుల విచారణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : మండల కేంద్రం, వడ్డెర కాలనీలో మైక్రో ఫైనాన్స్ బాధితుల సమస్యలపై వెలుగు ఎపిఎం వి.లాజర్, సిసి పూర్ణయ, యానిమేటర్ దేవకుమారిలు గురువారం ఆరా తీశారు. మైక్రోఫైనాన్స్ బాధితులపై 'మళ్లీ దారుణాలు పడగ' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. బాధితులను ఏ విధంగా ఒత్తిడి చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులుగా ఉన్న వారు డ్వాక్రా గ్రూపులో ఏ స్థాయిలో ఉన్నారనే రాతపూర్వకంగా తీసుకున్నారు.

పల్లెపండుగ వారోత్సవాలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో జరిగే పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపిడిఓ కె.శివపార్వతి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుండి 20 తేదీ వరకు జరిగే పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాలకు మండలానికి మొత్తం రూ.60 లక్షల ఎంజిఎన్-ఆర్ఇజిఎస్ నిధుల వచ్చాయని, అవి గనికపూడి గ్రామానికి రూ.10 లక్షలు, తిక్కిరెడ్డి పాలెనికి రూ.18 లక్షలు, ప్రత్తిపాడుకు రూ.22 లక్షలు, గొట్టిపాడుకు రూ.10లక్షలు గ్రాంట్ వచ్చాయన్నారు. వీటన్నింటినీ సిసిరోడ్లకు ఉపయోగించాలని, ఎక్కడైతే పనులు ప్రారంభించబోతున్నారో ఆ ప్రదేశాన్ని కచ్చితంగా జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు రూ.60 లక్షలకు సంబంధించి పనుల శంకుస్థాపనకు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పియర్ ఏఈ రాంబాబు, ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారి షేక్‌ఖాజా, ఎంజిఎన్-ఆర్ఇజిఎస్ సిఓ, ఏఏ.అరుణ, మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. దీనికి డిబిఆర్‌సి ఏరియా కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఎంపిడిఓ శివపార్వతి, ప్రత్తిపాడు సచివాలయం 2 మహిళా పోలీసుల ఉషారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిపుచ్చుకొని అభివృద్ధి కావాలన్నారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం మహిళలకు కార్మిక కార్డులు అందజేశారు. బాల్యవివాహాలను నిరోధించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - తెనాలి

తెనాలికి చెందిన శ్రీలక్ష్మీ కూచిపూడి నత్య కళాకేంద్రంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు పలు ప్రాంతాలలో నత్య ప్రదర్శన చేసి సత్తా చాటారని నృత్యగురువు ఎ.వెంకటలక్ష్మీ తెలిపారు. చిన్నారులు కాశీలోని కాశి విశ్వనాథ్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలలో హస్పిఫూట్‌లో గంగానది ఒడ్డున నత్య ప్రదర్శన చేశాన్నారు. అలాగే ఎనిమిదో తేదీన శ్రీరామ జన్మభూమిలో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్‌బోర్డు వారి ఆధ్వర్యంలో బాలరాముని మందిరంలో కూచిపూడి నత్య ప్రదర్శన చేసి రామ్‌లాల్ మందిర్ వారి ప్రశంసలను పొందారనిని పేర్కొన్నారు.

శ్రీలక్ష్మీదేవికి వెండి మకర తోరణం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణం శ్రీభద్రావతి సమేత భావనాఋషిస్వామి వారి దేవస్థానంలోని శ్రీలక్ష్మీదేవి ఉపాలయంలోని అమ్మవారికి గురువారం పాత మంగళగిరికి చెందిన గోలి కనక రామ్మోహనరావు జ్ఞాపకార్థం భార్య లోకేశ్వరి, కుటుంబ సభ్యులు గోలి సౌజన్య, అందే ఝాన్సీరాణి, పవన్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు రూ.నాలుగు లక్షలు విలువైన వెండి మకరతోరణాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయల అర్చకులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేసి అమరావతి రాజధానికి ముఖద్వారమైన మంగళగిరిలో ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని సరికొత్త ప్లాన్ తయారు చేసి అమలు చేయాలని సామాజిక కార్యకర్త గోలి లక్ష్మీకాంతారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉపముఖ్యమంత్రికి వినతి పత్రాలు పంపినట్లుగా లక్ష్మీ కాంతారావు తెలిపారు.

72 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాడికొండ

తాడికొండ గ్రామంలోని లింగయ్య పాఠశాలలో శంకరాకంటి ఆస్పత్రి సహకారంతో బండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి జయరామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత శిబిరంలో 72 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 31 మందికి కంటి శుక్లాలు గుర్తించారు. శంకరాకంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ ఉచితంగా చేస్తారని నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, దనేకుల హరిబాబు, నీలాద్రి వెంకటేశ్వరరావు, షేక్ బిలాల్, సి.భాస్కరరావు, కాసింశెట్టి పున్నారావు, ఎస్.రఫీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి మంగళగిరి

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సహకారంతో జరుగుతున్న మంగళగిరి కబడ్డీ లీగ్ పోటీలు హోరా హోరీగా కొనసాతున్నాయి. 13 జిల్లాల నుంచి 14 పురుషులు జట్లు, 14 మహిళల జట్లు పాల్గొంటుండగా పురుషుల టీములను నాలుగు గ్రూపులుగా, మహిళల టీములను నాలుగు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళగిరి బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన గల మైదానంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కబడ్డీ పోటీలు నిర్వహించారు. గురువారం రాత్రికి లీగ్ పూర్తి అవ్వగా శుక్రవారం నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. రెండోరోజు పురుషుల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లాపై కృష్ణా జిల్లా 11 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కర్నూలు జిల్లాపై విజయనగరం 10 పాయింట్లు, చిత్తూరుపై గుంటూరు జిల్లా 35 పాయింట్లు, శ్రీకాకుళంపై కడప జిల్లా 11 పాయింట్లు, కర్నూలు జిల్లాపై ప్రకాశం జిల్లా 18 పాయింట్లు, మంగళగిరిపై గుంటూరు జిల్లా 20 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి. మహిళా విభాగంలో కర్నూలు జిల్లాపై ప్రకాశం జిల్లా 4 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కబడ్డీ పోటీలకు ఈవెంట్ స్పాన్సర్‌గా మురళీకృష్ణ యార్లగడ్డ (మార్కోరోస్) వ్యవహరిస్తున్నారు.

ఘనంగా మల్లయ్య లింగం 52వ వర్ధంతి

ప్రజాశక్తి - గుంటూరు

మల్లయ్యలింగం ఆశయ సాధనకు కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు, కార్మికోద్యమ నేత మల్లయ్యలింగం 52వ వర్ధంతి సందర్భంగా కాకాని రోడ్డులోని ఆయన స్తూపం వద్ద సిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో, జిల్లాలో ఎఐటియుసి బలోపేతానికి మల్లయ్యలింగం ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. సభలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి, సిపిఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పాల్గొన్నారు.

జిఎంసి సిఎంహెచ్ఒగా శోభారాణి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. నగర పాలక సంస్థ నూతన సియంహెచ్ఓ గా బాధ్యతలు చేపట్టిన శోభారాణి గురువారం నగర మేయర్ మనోహర్ నాయుడును సంపత్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ముఖ్యంగా మురికివాడల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

మేయర్‌ను కలిసిన శోభారాణి

ఎవరెస్ట్ అధిరోహణ యాత్రలో పాల్గొంటున్న బృందంతో ఎస్ఆర్ఎం రిజిస్ట్రార్, డీన్లు

ఎవరెస్ట్ అధిరోహణకు ఎస్ఆర్ఎం విద్యార్థులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎంతో ప్రతిష్టాత్మకమైన ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణకు ఎస్ఆర్ఎం విద్యార్థులు బయలుదేరారు. గురువారం ఉదయం యూనివర్సిటీ ఆవరణలో రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొంటున్న విద్యార్థులు, ప్రొఫెసర్లకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎంతో సాహసంతో కూడిన ఈ యాత్రలో విద్యార్థులు పరస్పరం సహకారం అందించుకోవాలనీ యూనివర్సిటీ పేరును మరింత ఇనుమడింప చేయాలని కోరారు. ఈ యాత్రను రూపకల్పన చేసిన డాక్టర్ సిద్దార్ద్ శంకర్ త్రిపాఠిని అభినందించారు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొంటున్న ఇంజినీరింగ్ విద్యార్థులు శ్రీహర్షిత, భవ్యశ్రీ, రమ్యశ్రీ, చందన, సోహన్ కుమార్, సంజన, వేదాంశ్, ఆదిత్య, ఆకాష్, డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ రంజన, డాక్టర్ మనస్వి, డాక్టర్ హిరాకోలలకు విజయం సాధించాలని అభినందించారు. ఎవరెస్ట్ యాత్రకు బయలుదేరిన బృందం తిరిగి 28న యూనివర్సిటీ చేరుకుంటుందని డైరెక్టర్ సిద్ధార్థ త్రిపాఠీ పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ భరద్వాజ్, అసోసియేట్ డైరెక్టర్ ఉదయన్ భక్షి, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్ సింగ్, కమ్యూనికేషన్ డైరెక్టర్ పంకజ్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి సరికొత్త నిస్సాన్ మాగ్నైట్ విడుదల

ప్రజాశక్తి- గుంటూరు

మార్కెట్లోకి నిస్సాన్ 2024 వెర్షన్ మాగ్నైట్ సరికొత్త కారును గుంటూరులోని ఎక్స్‌ప్రెస్ నిస్సాన్ షోరూంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ పాములపాటి కిరణ్ మాట్లాడుతూ నిస్సాన్ మాగ్నైట్ 2024 వెర్షన్ కారు ఎక్స్‌షోరూమ్ ధర .5.99 లక్షలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. కొత్త మోడల్లో విసియా, విసియాం, యాసెంటా, ఎన్ కనెక్టా, టెక్నా, టెక్నాం వేరియంట్లలో లభిస్తుందని, ఇందులో అమర్చిన 1.0 లీటర్ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్ 98 బీహెచ్పీ, 160 ఎన్ఎం టార్క్ను అందిస్తుందని, 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ లేదా సీవిటీ గేర్ బాక్సుల్లో ఈ కార్ లభిస్తుందని తెలిపారు. ఆరు ఎయిర్ బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ వ్యవస్థ, ఈబీడీతో కూడిన ఏబియస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి భద్రతా ఫీచర్లు ఇందులో ఉన్నాయని చెప్పారు. మునుపటి మోడల్‌కు కొత్త వెర్షన్‌కు ధరలో మార్పులు చేయలేదన్నారు. బుకింగ్ కొరకు 9121144855 నెంబరును సంప్రదించాలని, తక్షణ డెలివరీ సౌకర్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సింధూర, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోహాలో 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక, దోహా, ఖతార్ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 22, 23 తేదీలలో ఖతార్ దేశరాజధాని దోహా మహానగరంలో జరుగుతున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని సదస్సు అధ్యక్షులు వంగూరి చిట్టెన్ రాజు, వెంకప్ప భాగవతుల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, బహెరైన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమాన్, అబుదాబి, రాస్ అల్ ఖైమాహ్ మొదలైన మధ్య ప్రాచ్య దేశాల నుంచే కాక అమెరికా, కెనడా, భారత దేశం, ఆఫ్రికా, సింగపూర్ తదితర ప్రాంతాల నుండి సుమారు 100 మంది రచయితలు, కవులు, పండితులు సాహితీవేత్తలు, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి మంత్రులు, నాయకులు కూడా ఈసదస్సు ప్రాధాన్యతని గుర్తించి ఆసక్తితో పాల్గొంటున్నారని తెలిపారు.మధ్య ప్రాచ్య దేశాలలో నివసిస్తున్న వారి సాహిత్య అభిమానానికి మొట్టమొదటిసారి ప్రపంచ స్థాయి గుర్తింపుగా నిర్వహించబడడం ఈ '9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు' ప్రత్యేకత అని, ప్రతిష్టాత్మకమైన ఈఅంతర్జాతీయ సాహితీ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషా, సాహిత్య అభిమానులు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమిష్టికృషి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, లింగ వివక్ష రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అన్నారు. గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం -2024 సందర్భంగా కలెక్టర్ ఛాంబర్‌లో ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరచిన విద్యార్థినులకు చిరు సన్మానంతో పాటు సర్టిఫికేట్లను కలెక్టర్ నాగలక్ష్మి అందచేశారు. కరాటే, యోగా, చదరంగంలో ప్రావిణ్యత కనబరిచిన అనిత, ఆంగ్ల విద్యలో అంజనకు, ఇటీవల సంభవించిన వరద సహాయక చర్యల్లో సేవలు అందించినందుకు జి.శృతి, డి.శైలజకు చిరు సన్మానంతోపాటు సర్టిఫికేట్లను కలెక్ట ప్రదానం చేశారు. అనంతరం 'బాల్య వివాహం చట్టరీత్యా నేరం- బాలల భవిష్యత్తుకు ద్రోహం' అనే పోస్టర్‌ను కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవితో కలసి ఆవిష్కరించారు. ఈ పోస్టర్లను జిల్లాలోని చర్చి, మసీదు, ఆలయాల్లో ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా స్త్రీ, సంక్షేమ, సాధికార అధికారి ఎమ్.ఉమాదేవి, బాలల సంక్షేమ సమితి గుంటూరు ఛైర్‌పర్సన్ పీఏ ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్. విజయకుమార్, సిడిపిఒ గుంటూరు అర్బన్ కే.మేరీ, బాలబాలికలు హాజరయ్యారు.

సత్కారం అందుకున్న బాలికలతో కలక్టర్, ఇతర అధికారులు

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని ఈపీఎఫ్ ఆఫీసు వద్ద ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో దేశ వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం స్థానిక కృష్ణ నగర్‌లోని ఇపిఎఫ్ రీజనల్ ఆఫీసు వద్ద ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కె.గంగాధర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పెన్షనర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బి.ప్రసాద్ మాట్లాడుతూ 30 సంవత్సరాలకు ముందు ఈపీఎఫ్ఓ సంస్థ ఈపీఎస్ ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ ప్రవేశపెట్టిందని ఇప్పటికీ నెలకు రూ.వెయ్యి మాత్రమే పెన్షన్ తీసుకుంటున్న వారు దేశంలో 28 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వీరందరూ రూ.వెయ్యి పెన్షన్‌తో ఎలా బతకాలని ప్రశ్నించారు. నిత్యావసర సరు కులు, కూరగాయలు, పెట్రోలు, గ్యాస్ ధరలు, మందుల ధరలు ఇలా అన్ని భారీగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు సైతం రూ.4వేలు ఇస్తుంటే కనీసం ఆ పెన్షన్ కూడా రిటైర్డ్ ఎంప్లాయీస్‌కి ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. పెన్షనర్ల సమస్యను రాష్ట్ర ప్రభుత్వంగానీ, కేంద్ర ప్రభుత్వంగానీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం గతంలో సమస్యలపై ఆందోళన చేసినప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట దాట వేస్తుందని అన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, ఆరు నెలలకు ఒకసారి డిఎ ఇవ్వాలని, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, హైయ్యర్ పెన్షన్ దరఖాస్తు ఆమోదించాలని, రైలు ప్రయాణంలో 50 శాతం రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఈపీఎఫ్ కమిషనర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజారావు, కోటేశ్వర రావు, ఎస్ఎస్ మన్యం, జి.రవీంద్ర, బి.డి.రావు, ఎ.నికల్సన్, వి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న పెన్షనర్లు

చివరి భూములకు సాగర్ జలాలు

పూడికతీత పనులు ప్రారంభించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

చివరి భూములకు సైతం నీరు అందాలనే ఆకురాజుపల్లి మేజర్ కాలువ పూడిక తీత పనులు నిర్వహిస్తున్నామని నర్సరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని అయ్యప్పనగర్ వద్ద ఉన్న ఆకురాజుపల్లి మేజర్ కాలువ పూడిక తీత పనులను ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలతో కలసి ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాలువ పూడిక తీత పనులతోపాటు పొలాలకు వెళ్లే దారులను కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గత పాలకుల వలన రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, దానిని దృష్టిలో ఉంచుకునే ఈ ఆకురాజుపల్లి మేజర్ కాలువ పనులు చేస్తున్నామని తెలిపారు. చివరి భూములకు సైతం నీరు అందాలని, నీరు అందలేదని ఏ రైతు పంట నష్టపోకూడదని తెలిపారు. ఆకురాజుపల్లి మేజర్ కాలువ ఆయకట్టు సుమారు 21 కిలో మీటర్ల వరకు ఉంటుందని, దీని పరిధిలో 24,984 ఎకరాల రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ యరపతినేని సొంత నిధులతో ఈ పనులు చేయించటం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ వై. శ్రీహరి, డీఈఈ మురళీధర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

కాలనీలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీల్లో పర్యటించారు. నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, సీతానగర్, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు దిగువకు వెళ్లేందుకు దారిలేక వెంకట్రావుపేట పక్కన ఉన్న ఖాళీ స్థలాలలో కుంటలాగా ఐదు అడుగుల మేర నిల్వ ఉందన్నారు.దీనివలన అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వెంటనే ఈనీరు నందివెలుగు రోడ్డు గుండా నగరానికి బయటకు వెళ్లేలా యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఈ కాలనీలోని రోడ్లను సర్వే చేసి ఆక్రమణలు తొలగించి రోడ్డుకి ఇరువైపులా కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్, సర్వే అధికారులను ఆదేశించారు. రాహుల్‌గాంధీ నగర్ ఏడోలైన్‌లో మంచినీటి పైప్‌లైన్ల లీకేజీని గమనించి, వాటిని రిపేర్ చేయాలని వాటర్ వర్క్స్ అధికారులను మందలించారు. గత ప్రభుత్వంలో ఏమాత్రం అభివద్ధి జరగలేదని గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఏకాలనీకి వెళ్లినా తెలుస్తుందని అన్నారు. కాలనీలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు.ఈ పర్యటనలో జబి, దీలిప్, మువ్వ శైలజ, కోట పిచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్